# ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com








నవంబర్ 12 గురువారం 2026 | సంపుటి : 1 | సంచిక : 33 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

THURSDAY NOVEMBER 12 2026 | VOL:1 | ISSUE: 33 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM


# వైట్‌కాలర్ జాబ్స్‌కు ఏఐ ముప్పు..

# బ్లూకాలర్‌కు ఢోకా లేదు: సీఎం రేవంత్

### విద్య, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక ప్రాధాన్యమిస్తున్నామన్న రేవంత్

### ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని వెల్లడి

### విద్య, నీటిపారుదలకు నెహ్రూ బలమైన పునాదులు వేశారని వ్యాఖ్య

### మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ



తెలంగాణలో విద్య, ఉపాధి అవకాశాల మెరుగుదలకు తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. యువతలో నైపుణ్యాలు పెంచేందుకు ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా (ఏటీసీ) మారుస్తున్నామని చెప్పారు. ఆధునిక వసతులతో స్కిల్ యూనివర్సిటీ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. బంజారాహిల్స్‌లోని సేవాలాల్ బంజారా భవన్‌లో నిర్వహించిన జాతీయ విద్య, మైనార్టీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.దేశంలో విద్య, నీటిపారుదల రంగాల అభివృద్ధికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బలమైన పునాదులు వేశారని సీఎం

(మిగతా 2వ పేజీలో..)

## తెలంగాణ బిడ్డలు అగ్ర దేశాలతో పోటీపడేలా విద్యా సంస్కరణలు: భట్టి విక్రమార్క

### కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భట్టి విక్రమార్క

### సుమారు రూ.11 కోట్ల వ్యయంతో అందుబాటులోకి రానున్న నూతన పాఠశాల భవనం

### పేద బిడ్డలకు ప్రపంచ స్థాయి విద్యను అందించడమే లక్ష్యమన్న డిప్యూటీ సీఎం

తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కాజీపేటలోని విద్యానగర్‌లో నూతన

(మిగతా 2వ పేజీలో..)




## ఎత్తిపోతల పునరుద్ధరణకు రూ.632 కోట్లు.. ఖరీఫ్ నాటికి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు సిద్ధం కావాలి: సీఎం చంద్రబాబు

### రూ.632 కోట్లతో 789 ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు

### ఖరీఫ్ నాటికి సాగునీరు అందించేలా పనులు పూర్తి చేయాలన్న చంద్రబాబు

### ఇరిగేషన్ భూముల్లో 903 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళిక



గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను (లిఫ్ట్ ఇరిగేషన్) తక్షణమే పునరుద్ధరించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి ఈ పథకాల ద్వారా రైతులకు సాగునీరు అందించేలా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, సౌర విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై నేడు ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా మరమ్మతుల దశలో ఉన్న 789 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.632.07 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఈ పనులు పూర్తి చేయడం ద్వారా సుమారు 7.49 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా సాగునీరు అందించవచ్చని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసి, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. వచ్చే జూన్ నాటికి ఈ పథకాలన్నీ వినియోగంలోకి రావాలని గడువు విధించారు. ఈ పథకాల పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను 'జలహారతి కార్పొరేషన్' ద్వారా చేపట్టాలని, ఇందుకోసం ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైతే ప్రతి జిల్లాకు ఒక చీఫ్ ఇంజినీర్ లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించి పర్యవేక్షణను పటిష్టం చేయాలని తెలిపారు.

ఇరిగేషన్ భూముల్లో 903 మెగావాట్ల సౌర విద్యుత్

సమీక్షలో భాగంగా జలవనరుల శాఖ పరిధిలోని భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై కూడా చర్చించారు.

(మిగతా 2వ పేజీలో..)

## ఏపీకి మరో వాయుగుండం ముప్పు.. ఈ తేదీల్లో వర్షాలు కురిసే ఛాన్స్!

### ఇది బలపడి వాయుగుండంగా మారే అవకాశం

### దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి వర్షాలు కురిసే అవకాశం కనిపిస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఎల్లుండి అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ఇది క్రమంగా బలపడి వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని తెలిపింది. నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరవచ్చని అంచనా వేసింది.అల్పపీడనం ఏర్పడిన 24 గంటల్లోనే తీవ్ర అల్పపీడనంగా బలపడుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆ తర్వాత వాయుగుండంగా మారే అవకాశముందని పేర్కొన్నారు. ఇది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తూ ఉత్తర తమిళనాడు తీరం వైపు కదులుతుందని వివరించారు.ఈ ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే భారీ వర్షాల కంటే తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలే ఎక్కువగా నమోదయ్యే సూచనలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.మరోవైపు ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఆ తర్వాత అల్పపీడనం కదలికను బట్టి వర్షాల పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# అమిత్ షా విశాఖ పర్యటన రద్దు

### విశాఖపట్నంలో రేపు ప్రారంభం కానున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు

### అనివార్య కారణాలతో అమిత్ షా పర్యటన రద్దు

### ముఖ్య అతిథిగా హాజరుకానున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

విశాఖపట్నం వేదికగా గురువారం ప్రారంభం కానున్న ప్రతిష్ఠాత్మక 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరు కావడం లేదు. అనివార్య కారణాల వల్ల ఆయన విశాఖ పర్యటన రద్దయినట్లు కేంద్ర హోంశాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి కూడా సమాచారం అందించింది. దీంతో అమిత్ షా స్థానంలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.విశాఖలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల




(మిగతా 2వ పేజీలో..)

## రూ.3,230 కోట్లతో 'యుగే యుగీ భారత్' మ్యూజియం.. కేంద్ర కేబినెట్ ఆమోదం

### రూ. 3,230 కోట్ల ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

### నార్త్, సౌత్ బ్లాక్ భవనాల్లో భారీ మ్యూజియం నిర్మాణం

### ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలంగా రికార్డు

### 2027 ద్వితీయార్ధంలో తొలి గ్యాలరీ ప్రారంభం

### ఏడాదికి కోటి మంది సందర్శకుల రాక అంచనా



భారతదేశ ఘనమైన చరిత్ర, నాగరికత, సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు సజీవంగా అందించే లక్ష్యంతో ప్రతిపాదించిన బృహత్తర ప్రాజెక్టు 'యుగే యుగీ భారత్ నేషనల్ మ్యూజియం' నిర్మాణానికి మార్గం సుగమమైంది. న్యూఢిల్లీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (CCEA) అధికారికంగా

(మిగతా 2వ పేజీలో..)

## 80 లక్షల మంది పట్టభద్రులలో 10 లక్షల మంది కూడా ఓటు నమోదు చేసుకోలేదు: కవిత ఆందోళన

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కవిత

### ఓటుతోనే మార్పు సాధ్యమని వ్యాఖ్య



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పోరాటాలు చేసినా రాష్ట్రంలో ఎలాంటి మార్పు రాలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సర్వమత ప్రార్థనల అనంతరం ఆమె గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో త్వరలోనే 77 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని కవిత తెలిపారు. తెలంగాణలోని 4 కోట్ల జనాభాలో దాదాపు 80 లక్షల మంది వరకు గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అయితే

(మిగతా 2వ పేజీలో..)

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

# వైట్‌కాలర్ జాబ్స్‌కు ఏఐ ముప్పు.. బ్లూకాలర్‌కు ఢోకా లేదు: సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను తొలి విద్యాశాఖ మంత్రిగా నియమించి, యూనివర్సిటీలు, ఐఐటీల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఆ ప్రయత్నాల ఫలితంగానే భారతీయులు ప్రపంచ ప్రఖ్యాత సంస్థల్లో ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని చెప్పారు.సాంకేతికత వేగంగా మారుతున్న నేపథ్యంలో కంపెనీల అవసరాలకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంతో వైట్‌కాలర్ ఉద్యోగాలకు ముప్పు పొంచి ఉందని, బ్లూకాలర్ ఉద్యోగాలకు మాత్రం ఆ ప్రమాదం లేదని అభిప్రాయపడ్డారు. మరోవైపు మైనార్టీలకు విద్య, ఉద్యోగాల్లో 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని గుర్తుచేశారు. విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల విషయంలో బీజేపీ రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. మైనార్టీలకు ఇచ్చిన హామీ మేరకు అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చామని రేవంత్‌రెడ్డి తెలిపారు. క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని గుర్తుచేశారు. మీరాలం చెరువుపై రూ.600 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మూసీ అభివృద్ధి పూర్తయితే పాతబస్తీకి పర్యాటకుల రాక పెరుగుతుందని, నగరంలో నైట్ ఎకానమీకి ఊతం లభిస్తుందని చెప్పారు. ఎస్ఐఆర్ పేరుతో పేదలు, మైనార్టీలు, ఎస్టీల ఓట్లు తొలగిస్తున్నారని బీజేపీపై ఆరోపణలు చేశారు. వచ్చే ఎన్నికల్లో మోదీని ఓడించడమే కాంగ్రెస్ లక్ష్యమని స్పష్టం చేశారు.

## సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలోనూ నాగార్జున హీరో: సీఎం రేవంత్



ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున సినిమాల్లోనే కాకుండా నిజ జీవితంలోనూ హీరో అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశంసించారు. మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ కోసం రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి తిరిగి అప్పగించినందుకు నాగార్జునను ఆయన అభినందించారు. పునరుద్ధరించిన చెరువును బుధవారం సాయంత్రం సీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున కూడా పాల్గొన్నారు.ఒకప్పుడు కబ్జాల కారణంగా దాదాపు 30 ఎకరాల విస్తీర్ణం గల తమ్మిడికుంట చెరువు 14 ఎకరాలకు కుచించుకుపోయింది. చెరువు స్థలాన్ని ఆక్రమించి నిర్మించారన్న ఆరోపణలతో 2024లో నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్‌ను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కూల్చివేసింది. మొదట కబ్జా ఆరోపణలను ఖండించినప్పటికీ, గతేడాది నాగార్జున స్వయంగా ముందుకొచ్చి రెండు ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పగించారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. “అక్కినేని నాగార్జున పెద్ద మనసుతో ముందుకొచ్చి 2 ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇచ్చారు. ఆయన సినిమాల్లోనే కాదు, నిజ జీవితంలోనూ హీరో అని నిరూపించుకున్నారు” అని అన్నారు. దీనిపై స్పందించిన నాగార్జున.. ముఖ్యమంత్రికి స్పష్టమైన దార్శనికత ఉందని, చెరువులు, నదుల పునరుజ్జీవనానికి ఆయన అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రశంసించారు. మూసీనది ప్రారంభోత్సవానికి కూడా తనను పిలుస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.హైదరాబాద్ నగరం ఒకప్పుడు రాళ్లు, చెరువులకు ప్రసిద్ధి అని సీఎం గుర్తుచేశారు. “నగరంలో ఒకప్పుడు 1,372 చెరువులు ఉంటే, అందులో 50 శాతం కనుమరుగయ్యాయి. చెరువులను కబ్జా చేయడం వల్లే వర్షం పడినప్పుడు రోడ్లపై నీరు నిలిచి కాలనీలు మునిగిపోతున్నాయి. ఈ పరిస్థితిపై ప్రతి ఒక్కరూ ఆలోచించాలి” అని పేర్కొన్నారు. ప్రకృతి పరిరక్షణతోనే హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే కలుషితమైన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టును కూడా చేపట్టామని సీఎం తెలిపారు. “ప్రపంచంలో నదీ ఆధారిత నాగరికతలే అభివృద్ధి చెందాయి. వందేళ్ల క్రితమే నిజాం మూసీ బేసిన్‌ను అభివృద్ధి చేశారు. ఇప్పుడు మేము మూసీని కేవలం సుందరీకరించడం లేదు, పూర్తిస్థాయిలో పునరుజ్జీవింపజేస్తున్నాము. ఈ ప్రాజెక్ట్ కింద నిర్వాసితులకు న్యాయం చేస్తాం” అని హామీ ఇచ్చారు. మూసీ పునరుజ్జీవనానికి రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు కలిసి రావాలని ఆయన కోరారు.

# తెలంగాణ బిడ్డలు అగ్ర దేశాలతో పోటీపడేలా విద్యా సంస్కరణలు: భట్టి విక్రమార్క

మొదటి పేజీ తరువాయి)

‘తెలంగాణ పబ్లిక్ స్కూల్’ భవన నిర్మాణానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. స్థానిక బీసీ వెల్ఫేర్ బాలుర వసతిగృహం ప్రాంగణంలో సుమారు రూ.10 కోట్ల నుంచి రూ.11 కోట్ల అంచనా వ్యయంతో ఈ పాఠశాల భవనాన్ని నిర్మించనున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో ‘యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్’, ‘తెలంగాణ పబ్లిక్ స్కూల్స్’ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలోని పది అగ్రదేశాలతో తెలంగాణ విద్యార్థులు పోటీపడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తూ పటిష్ఠపరుస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే సెమీ రెసిడెన్షియల్ విధానంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు. ఈ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు డిజిటల్ బోధన అందించడంతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. మరోవైపు, ఉపముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హనుమకొండలో ముందస్తు చర్యగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు.

# అమిత్ షా విశాఖ పర్యటన రద్దు

మొదటి పేజీ తరువాయి)

మైదానంలో నవంబర్ 12, 13 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ భాగస్వామ్య సదస్సు నిర్వహించనున్నారు. సీఐఐ, కేంద్ర వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని డీపీఐఐటీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా ఈ భారీ ఈవెంట్‌ను ఏర్పాటు చేశాయి. ‘నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్’ అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ సదస్సు జరుగుతోంది. దీనికి దాదాపు 58 దేశాల నుంచి దౌత్యవేత్తలు, అంతర్జాతీయ పారిశ్రామిక ప్రముఖులు హాజరవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సదస్సుకు కో-ఛైర్మన్ గా వ్యవహరిస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 13న జరిగే ముగింపు సమావేశానికి భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

## విశాఖలో పెట్టుబడుల జాతర.. రూ.12 లక్షల కోట్లకు పైగా ఒప్పందాలు!

- నేటి నుంచి విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు
- రూ.12 లక్షల కోట్లకు పైగా విలువైన ఒప్పందాలు
- 2.46 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- అమిత్ షా, పీయూష్ గోయల్ సహా పలువురు కేంద్ర మంత్రులు హాజరు
- కియా మోటార్స్‌తో ప్రత్యేకంగా కీలక ఒప్పందం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సంయుక్తంగా నిర్వహిస్తున్న 31వ భాగస్వామ్య సదస్సు నేడు విశాఖపట్నంలో ఘనంగా ప్రారంభం కానుంది. ఈ సదస్సు వేదికగా రాష్ట్రానికి భారీస్థాయిలో పెట్టుబడులు తరలిరానున్నాయి. సుమారు రూ.12,13,853 కోట్ల విలువైన పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోవడమే లక్ష్యంగా పెట్టుకోగా, వీటి ద్వారా రాష్ట్రంలో 2,46,373 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.రెండు రోజుల పాటు కొనసాగే ఈ సదస్సులో మొత్తం 141 అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయడంతో పాటు, 30 ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేయనున్నారు. వీటిలో కియా మోటార్స్‌తో కుదుర్చుకోనున్న ఒక ప్రత్యేక ఒప్పందంతో పాటు, పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో మరో రెండు కీలక ఒప్పందాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో జరుగుతున్న ఈ సదస్సు ప్రారంభోత్సవానికి కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ హాజరుకానున్నారు. ముగింపు కార్యక్రమానికి ఉపరాష్ట్రపతితో పాటు యూఏఈ, సింగపూర్, కెనడా వంటి వివిధ దేశాల మంత్రులు కూడా పాల్గొననున్నారు. ‘నవ ప్రపంచ క్రమంలో వాణిజ్యం, సాంకేతికత, విశ్వాసం, నాయకత్వం’ అనే ఇతివృత్తంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. జూన్ 2024 నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి సుమారు రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు రాగా, వాటిలో రూ.7.1 లక్షల కోట్ల విలువైన 303 ప్రాజెక్టులు ఇప్పటికే పట్టాలెక్కే దశలో ఉన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. గత ఏడాది జరిగిన సదస్సులో రూ.13 లక్షల కోట్లకు పైగా విలువైన ఒప్పందాలు కుదిరిన సంగతి తెలిసిందే. ఈ సదస్సులో భాగంగా పోర్టులు, ఇంధనం, ఏవియేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కీలక రంగాలపై ప్రత్యేక చర్చాగోష్ఠులు నిర్వహించనున్నారు



# రూ.3,230 కోట్లతో ‘యుగే యుగీ భారత్’ మ్యూజియం.. కేంద్ర కేబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి)

ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.3,230 కోట్లుగా నిర్ణయించారు.న్యూఢిల్లీలోని రైసినా హిల్స్‌పై రాష్ట్రపతి భవన్‌కు ఇరువైపులా ఉన్న చారిత్రక నార్త్, సౌత్ బ్లాకుల్లో ఈ సరికొత్త జాతీయ మ్యూజియాన్ని ఏర్పాటు చేయనున్నారు. 1912 నుంచి 1931 మధ్య కాలంలో నిర్మించిన ఈ కట్టడాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు ఇతర నూతన భవనాల్లోకి మారిన తర్వాత, వాటిని ప్రజా సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దుతారు. ఈ క్రమంలో భవనాల అసలు శైలి, చారిత్రక నిర్మాణ వారసత్వానికి ఎలాంటి విఘాతం కలగకుండా పునరుద్ధరించనున్నారు.ఈ మ్యూజియం ద్వారా భారతదేశ అనాది నాగరికతా ప్రయాణం, వైవిధ్యం, భౌతిక మరియు అభౌతిక వారసత్వాన్ని సమగ్రంగా ప్రదర్శించనున్నారు. అత్యాధునిక ఇమ్మర్సివ్ సాంకేతికత, సందర్శకులను ఆకట్టుకునే ప్రత్యేక థీమాటిక్ గ్యాలరీలతో అంతర్జాతీయ స్థాయి మ్యూజియాలకు ధీటుగా దీనిని రూపొందిస్తున్నారు. పూర్తయిన తర్వాత సుమారు 1,78,509 చదరపు మీటర్ల విస్తీర్ణంతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలం (డిస్‌ప్లే ఏరియా) కలిగిన మ్యూజియంగా ఇది రికార్డు సృష్టించనుంది.ఈ ప్రాజెక్టును 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు దశలవారీగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా మొదటి పబ్లిక్ గ్యాలరీ అయిన ‘అడోర్న్‌మెంట్’ను నార్త్ బ్లాక్‌లో 2027 ద్వితీయార్ధంలో సందర్శకులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మ్యూజియాన్ని ఏటా దాదాపు ఒక కోటి మందికి పైగా సందర్శిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.కేబినెట్ ఆమోదించిన రూ.3,230 కోట్ల నిధులను గ్యాలరీల అభివృద్ధి, ప్రాచీన వస్తువుల భద్రత, పరిరక్షణ, సందర్శకుల సౌకర్యాలు, ల్యాండ్‌స్కేపింగ్, ఇంటెలిజెంట్ బిల్డింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, అధునాతన మౌలిక వసతుల కల్పన కోసం వినియోగిస్తారు. భవిష్యత్తులో టికెట్ల విక్రయాలు, ఆహార మరియు పానీయాల విభాగాలు, ప్రత్యేక కార్యక్రమాల వేదికల అద్దెలు, డిజిటల్ అనుభవాలు, గైడెడ్ టూర్లు మరియు ప్రత్యేక రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా మ్యూజియానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకోనున్నారు.ఈ ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ 2023 మే 18న తొలిసారిగా ప్రకటించగా, 2026 జూలై 27న పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు దీనికి ప్రాథమిక అనుమతులు మంజూరు చేసింది. తాజా కేబినెట్ ఆమోదంతో పనులు మరింత వేగవంతం కానున్నాయి.

# ఎత్తిపోతల పునరుద్ధరణకు రూ.632 కోట్లు.. ఖరీఫ్ నాటికి

# లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు సిద్ధం కావాలి: సీఎం చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి)

జలవనరుల శాఖ, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 4,171 ఎకరాల భూమిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం ద్వారా 903.1 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని అధికారులు సీఎంకు వివరించారు. కేవలం భూములే కాకుండా కాలువలపై కూడా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. సాగు సీజన్‌లో ఎత్తిపోతల పథకాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించి, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం పొందే మార్గాలను అన్వేషించాలని తెలిపారు.

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుపై అధ్యయనం

విద్యుత్ రంగానికి ఉన్నట్లుగానే జలవనరుల శాఖకు కూడా ‘వాటర్ రెగ్యులేటరీ కమిషన్’ ఏర్పాటు చేసే అంశాన్ని అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. పోర్టులు, విద్యుత్ రంగాల తరహాలోనే సాగునీటి రంగంలోనూ ఒక నియంత్రణ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం వంటి వివిధ రంగాలకు నీటి కేటాయింపులపై ఈ కమిషన్ నిర్ణయాలు తీసుకునేలా వ్యవస్థను తీర్చిదిద్దవచ్చన్నారు.

ప్రాజెక్టులకు నిధుల కొరత లేదు

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన 36 సాగునీటి ప్రాజెక్టులను రాబోయే రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని సీఎం లక్ష్యం నిర్దేశించారు. ఈ ప్రాజెక్టులకు నిధుల కొరత రానివ్వబోమని హామీ ఇచ్చారు. నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

# 80 లక్షల మంది పట్టభద్రులలో 10 లక్షల మంది కూడా ఓటు నమోదు చేసుకోలేదు: కవిత ఆందోళన

మొదటి పేజీ తరువాయి)

అందులో కనీసం 10 లక్షల మంది కూడా ఓటర్లుగా నమోదు చేసుకోకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన పట్టభద్రులంతా వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కు ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోందని కవిత ఆరోపించారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, డబ్బులకు అమ్ముడుపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు తమ పార్టీ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది ఎన్నికల యుద్ధరంగంలోకి దించుతున్నామని ఆమె పేర్కొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



# హుజూర్‌నగర్ మున్సిపాలిటీ నిధుల ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**హుజూర్‌నగర్, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

హుజూర్‌నగర్ మున్సిపాలిటీలో జనరల్ ఫండ్, క్యాపిటల్ ఫండ్ కింద మంజూరైన నిధులు, వాటి వినియోగం, ఖర్చులపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరుతూ ఐదుగురు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.ఇటీవల నిర్వహించిన మున్సిపల్ జనరల్ బాడీ సమావేశంలో నిధుల వివరాలను అధికారులు సంక్షిప్తంగా వెల్లడించారని, అయితే పూర్తి స్థాయి లెక్కలను ప్రజాప్రతినిధులకు అందించాలని వారు కోరారు.మున్సిపాలిటీలో ఇంజనీరింగ్, శానిటేషన్ తదితర విభాగాల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు, కాంట్రాక్టర్లకు అప్పగించిన పనులు, కేటాయించిన నిధులు, చేసిన ఖర్చులు, చెల్లింపుల వివరాలను వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా సిబ్బంది వేతనాలు, వార్డుల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులు, వాటికి సంబంధించిన బిల్లులు, చెల్లింపుల వివరాలను అందించాలని కోరారు.ప్రజాధనం వినియోగంలో పారదర్శకత ఉండాలని, మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలపై ప్రజలకు స్పష్టత కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. జనరల్ ఫండ్, క్యాపిటల్ ఫండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేస్తూ శ్వేతపత్రం విడుదల చేయాలని కమిషనర్‌ను కోరారు.ఈ



కార్యక్రమంలో 1వ వార్డు కౌన్సిలర్ కోడి జ్యోతి ఉపేందర్, 8వ వార్డు కౌన్సిలర్ కోల ఉదయభాను, 22వ వార్డు కౌన్సిలర్ అమరబోయిన ఊహ సతీష్, 23వ వార్డు కౌన్సిలర్ అట్లూరి మంజుల హరిబాబు, 24వ వార్డు కౌన్సిలర్ యడ్ల విజయ్ పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లు అడ్డుకునే పార్టీలను రాజకీయంగా సమాధి చేయాలి

**హైదరాబాద్, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**


స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడాన్ని అడ్డుకుంటున్న పార్టీలకు బీసీలు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని సమితి రాష్ట్ర కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో 42 శాతం బీసీ రాజకీయ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపగా, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పార్టీ కూడా బీసీల విషయంలో ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని ధనుంజయ నాయుడు విమర్శించారు. గత పదేళ్ల పాలనలో బీసీల అభ్యున్నతికి తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో జ్యోతిరావు పూలే జయంతి, వర్ధంతి కార్యక్రమాలకు కూడా తగిన గుర్తింపు లభించలేదని ఆరోపించారు. ప్రస్తుతం బీసీల పట్ల ప్రేమను ప్రదర్శిస్తున్న బీఆర్ఎస్ నేతలు గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. కల్వకుంట్ల కవిత బీసీల అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు ప్రకటించుకోవడంపైనా ఆయన విమర్శలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల కోసం ఇటీవల ఆర్డినెన్స్ జారీ చేసిన నేపథ్యంలో గవర్నర్ వెంటనే ఆమోదం తెలపాలని కోరారు. 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం రాష్ట్రంలోని అన్ని బీసీ సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని ధూళిపాళ ధనుంజయ నాయుడు పిలుపునిచ్చారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

**సూర్యాపేట, నవంబర్ 10 (ప్రజానేస్తం జ్వాల):**

జాతీయ రహదారి 65పై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రమాద ప్రభావిత ప్రాంతాలైన అంజనాపురి చౌరస్తా, కొత్త మార్కెట్ చౌరస్తా, ఈనాడు జంక్షన్ తదితర ప్రాంతాల్లో రహదారి భద్రత చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ప్రమాదాలకు ఆస్కారం కలిగించే విధంగా రహదారులను ఆక్రమించి నిర్వహిస్తున్న వ్యాపారాలను తొలగిస్తున్నామని, వాహనదారులకు ఇబ్బందులు కలిగించే వ్యాపార ప్రకటన బోర్డులను సైతం తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. రహదారుల వెంట పెరిగిన పొదలను తొలగించడంతో పాటు, వాహనదారులకు స్పష్టమైన రహదారి కనిపించేలా అవసరమైన ప్రాంతాల్లో లైటింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను ప్రత్యేక బృందాలతో పరిశీలించి, ప్రమాదాలకు గల కారణాలను విశ్లేషిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా గుర్తించిన సమస్యల ఆధారంగా నివారణ చర్యలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో కేసులు నమోదు చేస్తున్నామని స్పష్టం చేశారు.వాహనదారులు అతివేగానికి దూరంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రాంగ్ రూట్‌లో ప్రయాణించకూడదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, యువత ప్రమాదకర బైక్ రైడింగ్, రేసింగ్‌లకు పాల్పడరాదని హెచ్చరించారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వకూడదని, రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయడం మానుకోవాలని సూచించారు.వాహనదారుల అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగా అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, ఒక ప్రమాదంలో వ్యక్తి ప్రాణాలు కోల్పోతే



ఆ కుటుంబం జీవితాంతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎస్ఐ పేర్కొన్నారు. ట్రాఫిక్ జరిమానాలు విధించడం కేవలం శిక్షించడానికి మాత్రమే కాదని, వాహనదారుల్లో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించి ప్రమాదాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యమని వివరించారు.రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి సహకరించాలని ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల వేతనాలు పెంచాలి

**మిర్యాలగూడ, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల వేతనాలు పెంచడంతో పాటు, వారి న్యాయమైన హక్కులను అమలు చేయాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కార్మికులకు చట్టప్రకారం వేతనాలు పెంచాలని, పండుగ సెలవులు, జాతీయ సెలవులు, అర్జిత సెలవులు అమలు చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం ఒక నెల వేతనాన్ని బోనస్‌గా చెల్లించాలని, ప్రతి కార్మికుడికి రెండు జతల యూనిఫారాలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సొమ్మును కార్మికుల ఖాతాల్లో సక్రమంగా జమ చేయాలని కోరారు.సాధారణంగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి కార్మికుల వేతనాలు పెంచాల్సి ఉన్నప్పటికీ, నాలుగు సంవత్సరాలు దాటినా ఇప్పటివరకు వేతనాల పెంపుదల జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 6 ప్రకారం కొత్తగా విధుల్లో చేరే కార్మికులకు కనీసం రూ.16 వేల వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10 నుంచి 20 సంవత్సరాలుగా సేవలందిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ కార్మికులకు వారి సర్వీసు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని నెలకు రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్టర్లు కార్మికుల వేతనాల నుంచి ఈఎస్ఐ, పీఎఫ్ సొమ్మును మినహాయిస్తున్నప్పటికీ, నిబంధనల ప్రకారం యాజమాన్యం తరపున జమ చేయాల్సిన వాటాను సక్రమంగా జమ చేయడం లేదని ఆరోపించారు. కార్మికులకు చెల్లించే పూర్తి వేతనంపై చట్టప్రకారం ఈఎస్ఐ, పీఎఫ్ మినహాయింపులు చేసి, యాజమాన్యం వాటాను కూడా సంబంధిత ఖాతాల్లో జమ చేయాలని కోరారు. కాంట్రాక్టర్లు ఈ బాధ్యతను నిర్వర్తించకపోతే చట్టప్రకారం ప్రధాన యాజమాన్యం బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు.కార్మికులు ప్రతిరోజూ కష్టపడి విధులు నిర్వహిస్తున్నప్పటికీ, వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబాల ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నెలా నిర్దిష్ట తేదీకి జీతాలు చెల్లించాలని కోరారు. కార్మికుల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమర్పించిన వినతిపత్రంలో విజ్ఞప్తి చేసినట్లు బంటు వెంకటేశ్వర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు ఎస్కే షమీం, రామలింగం, బిక్షం, స్వామి, బేగం తదితరులు పాల్గొన్నారు.



## తూనికలు, కొలతల్లో అక్రమాలకు తావివ్వొద్దు

**భీమదేవరపల్లి, నవంబర్ 11, ప్రజా నేస్తం జ్వాల:**



భీమదేవరపల్లి మండలంలోని మల్లారం గ్రామంలో తూనికలు, కొలతల శాఖ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో గ్రామంలోని పలు దుకాణాలను తనిఖీ చేసి, వ్యాపారులు వినియోగిస్తున్న తూనికలు, కొలతల యంత్రాలను పరిశీలించారు. అనంతరం ముల్కనూరు సహకార సంఘం మల్లారం గోదాములోని వెయిట్ బ్రిడ్జిని తనిఖీ చేశారు. వ్యాపారులు ఖచ్చితమైన తూనికలు, కొలతలు పాటించాలని, వినియోగించే యంత్రాలకు తప్పనిసరిగా ధృవీకరణ చేయించుకోవాలని అధికారులు సూచించారు. తూనికలు, కొలతల్లో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**భీమదేవరపల్లి, నవంబర్ 11, ప్రజా నేస్తం జ్వాల:**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని వంగర, కొత్తకొండ, మాణిక్యపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బొక్కల స్రవంతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను కోరారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూస కోయిల ప్రకాష్, మొండయ్య, రమేష్, సతీష్, శారద, అశోక్, చింతరాజు, జక్కుల అనిల్, వెంకటేష్, వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓ, గ్రామ కార్యదర్శి, సీసీ సదానందం, సీఏలు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ వేలేరు మండల విస్తృతస్థాయి సమావేశం

**వేలేరు, నవంబర్ 11, ప్రజా నేస్తం జ్వాల:**



కాంగ్రెస్ పార్టీ వేలేరు మండల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం, నూతన గ్రామ కమిటీల పరిచయ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వేలేరు మండలంలోని 12 గ్రామాలకు నూతనంగా ఎన్నికైన గ్రామ శాఖ అధ్యక్షులను సన్మానించి, పార్టీ బాధ్యతలను అప్పగించారు. బండతండ గ్రామ కాంగ్రెస్ పార్టీ శాఖ అధ్యక్షుడిగా మాలోతు శ్రీకాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా మాలోతు శ్రీకాంత్ మాట్లాడుతూ తనకు గ్రామ శాఖ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకటరామ్ రెడ్డి, వేలేరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మురావత్ లక్ష్మణ్ నాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే సర్పంచ్ మాలోతు అరుణ నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్ కత్తి సంపత్, మాజీ సర్పంచ్ మల్లికార్జున్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## విద్యార్థులకు చట్టపరమైన అంశాలపై అవగాహన

**బిజినపల్లి, నవంబర్ 11, ప్రజా నేస్తం జ్వాల:**



నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి మండలం పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టపరమైన అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నిహారిక ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు చట్టపరమైన హక్కులు, బాధ్యతలు, చట్టాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రభుత్వ న్యాయవాది శ్రీరామ్ ఆర్య సైతం కార్యక్రమంలో పాల్గొని సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, వాటి పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ మైనుద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## గట్టుప్పల్ మండలంలో కొత్త పెన్షన్ల మంజూరుపై వివాదం.. అర్హులకు న్యాయం చేయాలి

**గట్టుప్పల్, నవంబర్ 11, ప్రజా నేస్తం జ్వాల:**

గట్టుప్పల్ మండలంలో కొత్త పెన్షన్ల మంజూరు ప్రక్రియపై పలు ప్రశ్నలు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో కొత్త పెన్షన్ల కోసం సుమారు 680 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో కేవలం 490 మందికి మాత్రమే పెన్షన్లు మంజూరైనట్లు సమాచారం. మిగిలిన దరఖాస్తులను ఏ కారణాలతో తిరస్కరించారనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.తిరస్కరణకు గురైన దరఖాస్తుల్లో నిరుపేదలు, చేనేత కార్మికులు కూడా ఉన్నారని, అర్హత ఉన్నప్పటికీ వారికి పెన్షన్లు మంజూరు కాకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెన్షన్లు పొందిన వారిలో కొందరి పేర్లను తొలగించి, కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి ప్రాధాన్యత ఇచ్చారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.మిగిలిన దరఖాస్తులను ఎందుకు తిరస్కరించారు? అర్హులైన చేనేత కార్మికులకు పెన్షన్లు ఎందుకు మంజూరు కాలేదు? పెన్షన్ల జాబితా నుంచి పేర్లు తొలగించడానికి కారణాలేమిటి? అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలని కోరుతున్నారు. పెన్షన్లు రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు అందాల్సిన సంక్షేమ పథకమని, పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా అర్హులందరికీ న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గట్టుప్పల్ మండల అధికారులు 680 దరఖాస్తులకు సంబంధించిన పూర్తి వివరాలు, మంజూరు, తిరస్కరణకు గల కారణాలను బహిర్గతం చేసి, అర్హులైన వారికి పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



# పల్లె మనసు

కుట్రలు లేవు,
కుతంత్రాలు లేవు.
ఆశ లేదు,
అసూయ లేదు.
బంగారం కావాలని లేదు..
బ్యాంక్ బ్యాలెన్స్ పై
బెంగా లేదు..
కపటం లేదు,
కల్మషం లేదు.
అబద్ధం లేదు,
ఆఘత్యం లేదు.
వెకిలి చేష్టలు లేవు,
వెన్నుపోటు లేదు.
స్వచ్ఛమైన గాలి
మలినం లేని మనస్సు
ప్రేమానురాగాలు..
మంచిని పంచే
మమకారాలు..
అనురాగాలు
ఆప్యాయతలు..
అంతకు మించి
ఊరంతా ఒకే కుటుంబమై
కలిసిమెలిసి పోయే
మనుష్యులు
ఇంతకు మించి
ఇంకేమి కావాలి
ఈ జీవితానికి?

తాళ్ళపెల్లి సురేందర్

## పేద విద్యార్థుల పదో తరగతి పరీక్ష ఫీజులకు ఎస్‌టీయూ ఆర్థిక సహాయం

**రాయనిగూడెం, నవంబర్ 11, ప్రజా నేస్తం జ్వాల:**



ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచడం ప్రభుత్వ బాధ్యత అని, ఉపాధ్యాయ సంఘాల కృషితోనే పాఠశాలలకు ఉచిత విద్యుత్, విద్యార్థులకు బూట్లు, సాక్సులు వంటి సౌకర్యాలు అందుతున్నాయని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ అన్నారు.బుధవారం రాయనిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌టీయూ సంఘం, ప్రాణిక్ హీలింగ్ యోగ సంస్థ సంయుక్త సహకారంతో 22 మంది పదో తరగతి విద్యార్థులకు రూ.5,500 పరీక్ష ఫీజును నగదు రూపంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణికి అందజేశారు. ఈ సందర్భంగా సదానందం గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, బలహీన వర్గాల విద్యార్థులకు దాతల సహకారంతో 8 పాఠశాలల్లోని 250 మంది విద్యార్థులకు రూ.60 వేల ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమానికి కృషి చేసిన ఎస్‌టీయూ నాయకుడు పాలూరు అంజయ్యను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకున్న విద్యావంతులంతా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, పేద విద్యార్థుల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగమణి, పద్మ, ఎస్‌టీయూ నాయకులు కె.వి. సత్యనారాయణ, కె. వీరరాఘవులు, పిట్టల నాగేశ్వరరావు, మీసాల నరసింహారావు, జానకిరెడ్డి, హరిలాల్, శశికళ, విజయనిర్మల, ప్రదీప్, ఉష తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై గుంతలు పూడ్చి ప్రమాదాల నివారణకు చర్యలు

**సూర్యాపేట, నవంబర్ 11, ప్రజా నేస్తం జ్వాల:**



సూర్యాపేట పట్టణ పరిధిలోని జాతీయ రహదారి-65పై ఈనాడు ఆఫీస్ జంక్షన్ వద్ద రహదారిపై ఏర్పడిన గుంతలు వాహనదారులకు ప్రమాదకరంగా మారడంతో ట్రాఫిక్ పోలీసులు తక్షణ చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం ట్రాఫిక్ పోలీసులు గుంతలను పూడ్చివేయించారు.వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ పనులు చేపట్టారు.ఈ సందర్భంగా పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి మాట్లాడుతూ వాహనదారులు రహదారులపై ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, వేగాన్ని నియంత్రించుకొని నిదానంగా వాహనాలు నడపాలని సూచించారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చేయాలని కోరారు.

# కరువును రాజకీయ ఆయుధంగా వాడుకుంటున్న బీఆర్ఎస్

- **కృష్ణా, గోదావరి జలాల మళ్లింపుపై అసత్య ప్రచారం చేస్తున్నారు**
- **జనవరి 31లోగా పులిచింతల తీరంలోని 15 గ్రామాల పరిధిలో 10 వేల ఎకరాలకు కృష్ణా జలాలు అందించాలి: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

**హుజూర్‌నగర్, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**


కరువును రాజకీయ ఆయుధంగా వాడుకుంటూ బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాలను ఆంధ్రప్రదేశ్‌కు మళ్లిస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. నీటి ఎద్దడి ముప్పు పొంచి ఉన్న సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన ప్రధాన ప్రతిపక్షం వారి సమస్యల నుంచి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు.బుధవారం సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పలు ఎత్తిపోతల పథకాల నిర్మాణ పనులను, యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణాన్ని పరిశీలించారు. నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ హయాంలో పెరిగిన జల వినియోగం

2023 డిసెంబర్ 7న కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే తెలంగాణలో కృష్ణా, గోదావరి జలాల వినియోగం పెరిగిందని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. సాగు విస్తీర్ణం, వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణ కూడా పెరిగాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటిని మళ్లిస్తున్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాగునీటి రంగంలో పేరుకుపోయిన సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ధాన్యం కొనుగోళ్ల ద్వారా రైతులకు సుమారు రూ.90 వేల కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యం సొమ్మును 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని, సన్న రకాల వరి సాగును ప్రోత్సహించేందుకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని వివరించారు.

### జనవరి 31లోగా 10 వేల ఎకరాలకు సాగునీరు

పులిచింతల జలాశయం తీర ప్రాంత గ్రామాల రైతులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకాన్ని జనవరి నెలాఖరులోగా ప్రారంభిస్తామని మంత్రి ప్రకటించారు. సవరించిన ఆయకట్టు పరిధిలోని 10 వేల ఎకరాలకు 2027 జనవరి 31 నాటికి కృష్ణా జలాలు అందించాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.పనులను పలుమార్లు పరిశీలించినప్పటికీ గడువులు మారుతున్నాయని, ఇకపై అలా జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కృష్ణా నది సమీపంలో ఉన్నప్పటికీ దశాబ్దాలుగా సాగునీటికి నోచుకోని వేలాది రైతు కుటుంబాలకు ఈ పథకం ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని, ఏటా రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.ఈ ఎత్తిపోతల పథకం ద్వారా జాన్‌పహాడ్, పాలకవీడు, కోమటికుంట, ఓతులపాలెం, ఎల్లాపురం, సజాపురం, హనుమాయగూడెం, నాగిరెడ్డిగూడెం, గుడుగుంట్లపాలెం, గుండ్లపహాడ్, చెరువుతండా, అలింగాపురం, గుండెబోయినగూడెం, రాఘవాపురం, మిగడంపాడు తండా గ్రామాలకు సాగునీరు అందనుందని వివరించారు.పంపులు, మోటార్లు ఇప్పటికే పనుల ప్రదేశానికి చేరుకున్నాయని, పంప్‌హౌస్ నిర్మాణ పనులు తుది దశలో ఉన్నాయని తెలిపారు. డిసెంబర్ నెలాఖరులోగా పంప్‌హౌస్, జనవరి నెలాఖరులోగా విద్యుత్ ఉపకేంద్రం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కల్మల తండా వైపు నీరు అందించేందుకు బుడ్డారపాలెం వద్ద కిలోమీటరు మేర కాలువ అనుసంధాన పనులు పూర్తి చేయాలని సూచించారు. జాన్‌పహాడ్, మునిమోపుల, తుమ్మలతో పాటు మరో మూడు చెరువులను ఈ పథకం ద్వారా నింపనున్నట్లు వెల్లడించారు.జాన్‌పహాడ్ ఎత్తిపోతల పథకం తన ప్రాధాన్యతా పథకాల్లో ఒకటని మంత్రి పేర్కొన్నారు. కృష్ణా నదికి చేరువలో ఉన్నప్పటికీ సాగునీరు అందని భూములకు నీటిని అందించడం సంతృప్తినిస్తోందన్నారు. ముక్తేశ్వరం సహా స్థానిక ఎత్తిపోతల పథకాలు రైతు కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకురాగలవని ఆశాభావం వ్యక్తం చేశారు.



### యాసంగిలో ఆరుతడి పంటలు సాగు చేయాలి

ఎల్‌నినో ప్రభావంతో రాబోయే యాసంగి సీజన్‌లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. రైతులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని, అందుబాటులో ఉన్న సాగునీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు.వేసవిలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉన్న జలాలను సమర్థంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థకు అవసరమైన సన్నబియ్యంతో పాటు ఇతర ఆహార ధాన్యాల నిల్వలను కూడా సిద్ధం చేసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు.

# కోదాడలో అభివృద్ధి పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**కోదాడ, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



కోదాడ పట్టణంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.ఈ సందర్భంగా రూ.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నీటిపారుదల శాఖ నూతన భవనాన్ని, రూ.8 కోట్ల వ్యయంతో చేపడుతున్న రోడ్లు, భవనాల శాఖ నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. అదేవిధంగా పట్టణంలో నిర్మిస్తున్న షాదీఖానా పనుల పురోగతిని కూడా అధికారులను అడిగి తెలుసుకున్నారు.భవన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని మంత్రి సూచించారు. నూతన ఆర్కిటెక్చర్ డిజైన్లతో పట్టణానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా భవనాలను నిర్మించాలని, పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, ఆర్డీవో సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మర్రికుంట వద్ద నాగార్జునసాగర్ కాలువపై నూతన బ్రిడ్జి నిర్మించాలి



**గరిడేపల్లి, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

నాగార్జునసాగర్ ప్రధాన కాలువపై గరిడేపల్లి--సూర్యాపేట ప్రధాన రహదారిలోని మర్రికుంట వద్ద ఉన్న ఇరుకు వంతెన స్థానంలో నేటి అవసరాలకు అనుగుణంగా పెద్ద బ్రిడ్జిని వెంటనే నిర్మించాలని సీపీఐ గరిడేపల్లి మండల కార్యదర్శి కడియాల అప్పయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సీపీఐ గరిడేపల్లి మండల సమితి ఆధ్వర్యంలో మర్రికుంట వద్ద ఉన్న బ్రిడ్జి సమీపంలో రాష్ట్ర రాస్తారోకో నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కడియాల అప్పయ్య మాట్లాడుతూ.. గతంలో అప్పటి అవసరాలకు అనుగుణంగా నిర్మించిన ఈ వంతెన ప్రస్తుతం పెరిగిన వాహనాల రద్దీకి ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. వంతెనపై ఒక వాహనం మాత్రమే వెళ్లేంత స్థలం ఉండటంతో ఎదురుగా మరో వాహనం వస్తే ప్రయాణించడం సాధ్యం కావడం లేదని తెలిపారు.ఈ ఇరుకు వంతెనపై ప్రయాణిస్తూ దశాబ్దాలుగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనేకమంది ప్రమాదాలకు గురై గాయాలపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు కొందరు ప్రాణాలు కూడా కోల్పోయారని, అయినప్పటికీ ప్రభుత్వాలు స్పందించకపోవడం బాధాకరమని అన్నారు.అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం పనిచేస్తామని చెబుతున్నప్పటికీ, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు.రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నారని, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ పరిధిలోనే ఈ ఇరుకు వంతెన ఉందని గుర్తుచేశారు. నీటిపారుదల శాఖ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నందున మర్రికుంట బ్రిడ్జి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే నూతన వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజలు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇకనైనా స్పందించి పెద్ద బ్రిడ్జిని నిర్మించి ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కడియాల అప్పయ్య డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి త్రిపురం సుధాకర్‌రెడ్డి, అంబటి గోవిందరెడ్డి, పంగా ఈదయ్య, యడ్ల అంజిరెడ్డి, కుందూరు వెంకటరెడ్డి, గోధుముల ఈశ్వరాచారి, వేశాల ఆంజనేయులు, కట్టా అశోక్, షేక్ పీర్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీకొని వివాహిత దుర్మరణం



**నేరేడుచర్ల, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

అతివేగంగా వచ్చిన టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ వివాహిత అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన నేరేడుచర్ల వద్ద చోటుచేసుకుంది. భర్త కళ్ల ముందే భార్య ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.వివరాల్లోకి వెళితే.. ఖమ్మం జిల్లా నాగులవంచ గ్రామానికి చెందిన బొమ్మిని సూరమ్మ (40), తన భర్త వెంకన్నతో కలిసి చిలక జ్యోతిష్యం చెబుతూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మిర్యాలగూడ నుంచి హుజూర్‌నగర్‌కు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుండగా నేరేడుచర్ల వద్ద వేగంగా వచ్చిన టిప్పర్ వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సూరమ్మ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది.తన కళ్ల ముందే భార్య ప్రాణాలు కోల్పోవడంతో భర్త వెంకన్న కన్నీరుమున్నీరయ్యారు. టిప్పర్ డ్రైవర్ అతివేగం, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలికి భర్తతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నేరేడుచర్ల ఎస్ఐ సీహెచ్. గోపాల్ రెడ్డి తెలిపారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు సమాచారం.

## భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి ఆత్మహత్య

**కాగజ్‌నగర్, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

భార్య కాపురానికి తిరిగి రావడం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ మండలం బలగల గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బలగల గ్రామానికి చెందిన గౌరవయ్య (40) భార్య నాలుగేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లి తిరిగి కాపురానికి రాకపోవడంతో అప్పటి నుంచి మనస్తాపంతో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాగజ్‌నగర్ ఎస్సై సందీప్ తెలిపారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



# విద్యారంగ అభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విశేష కృషి

**హుజూర్‌నగర్, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

ఆధునిక భారత విద్యారంగానికి బలమైన పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూర్‌నగర్ స్థానిక గ్రంథాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర మాజీ జాయింట్ సెక్రటరీ ఎండీ అజీజ్ పాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గెల్లి రవి, గ్రంథాలయ కమిటీ చైర్మన్ బచ్చు రామారావు, మాజీ సర్పంచ్ గొట్టే రామయ్య, విజిలెన్స్ కమిటీ సభ్యులు గల్లా వెంకటేశ్వర్లు, పోతుల జ్ఞానయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని విశ్వసించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విశేష సేవలందించారని పేర్కొన్నారు. 1888 నవంబర్ 11న మక్కాలో జన్మించిన ఆయన, 1947 నుంచి 1958 వరకు విద్యాశాఖ మంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. దేశంలో ఆధునిక విద్యావ్యవస్థ అభివృద్ధికి, ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)ల అభివృద్ధితో పాటు సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ వంటి సంస్థల ఏర్పాటుకు ఆయన కృషి చేశారని వివరించారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, జాతీయవాదిగా దేశానికి సేవలందించారని, భారత విభజనను వ్యతిరేకించారని తెలిపారు. ఆయన సేవలకు గుర్తింపుగా 1992లో మరణానంతరం భారతరత్న పురస్కారం లభించిందని పేర్కొన్నారు. నేటి



ఆధునిక కాలంలోనూ ఆజాద్ రచనలు, విద్యపై ఆయన ఆలోచనలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థల్లో విద్య ప్రాముఖ్యతపై సదస్సులు, వ్యాసరచన పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థులు ఎస్.కె. మన్సూర్ అలీ, గంజి శివ, మజీద్ భాయ్, బిక్కన్ సాబ్, ముషం సత్యనారాయణ, సైదులు నాయక్, కోలపూడి యోహాన్, కస్తాల దిల్, గొట్టిముక్కుల రాములు, ఎస్.డి. ఆశ్రఫ్ అలీ, శ్రీనివాస్ రెడ్డి, మేళ్లచెరువు ముక్కంటి, నాగేందర్, చింతకాయల రాము, ఎన్. రఫీ, భార్గవ్, నవీన్, వినోద్, మధు, క్రాంతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కోదాడలో రూ.50 కోట్లతో నిర్మిస్తున్న నవోదయ విద్యాలయ పనుల పరిశీలన

- **నిర్మాణ పనులను వేగవంతం చేసి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**కోదాడ, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



కోదాడ పట్టణంలోని బాలాజీనగర్‌లో రూ.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న జవహర్ నవోదయ విద్యాలయ నూతన భవన నిర్మాణ పనులను రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, విద్యార్థులకు కల్పించనున్న మౌలిక సదుపాయాల గురించి సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పాఠశాల భవన నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో సమీక్షించి, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ఈ విద్యాలయ నిర్మాణాన్ని చేపట్టినట్లు మంత్రి పేర్కొన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నాణ్యతా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడకుండా నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొమురం భీమ్ మనుమడు భీంరావ్ మృతి

**సిర్పూర్ (యు), నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



కొమురం భీమ్ రెండో మనుమడు, సోనేరావ్ వాలా తమ్ముడు భీంరావ్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతితో కొమురం భీమ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. శనివారం జైనూర్‌లో ఆటో, బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో భీంరావ్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించారు. అయితే, పరిస్థితి విషమించడంతో రాత్రి చికిత్స పొందుతూ భీంరావ్ తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కొమురం భీమ్ వంశానికి చెందిన వ్యక్తి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర శోకంలో మునిగిపోయారు. ఈ ఘటన ఆదివాసీ సమాజంలోనూ విషాదాన్ని నింపింది.

## మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులును పరామర్శించిన ఎర్రబెల్లి

**హైదరాబాద్, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



ఇటీవల స్వల్ప అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం కోలుకుంటున్న మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులును మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని మోత్కుపల్లి నర్సింహులు నివాసానికి వెళ్లిన ఎర్రబెల్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి నర్సింహులును ఆప్యాయంగా పలకరించి, ఆరోగ్యం ఎలా ఉందని వివరాలు తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని, తిరిగి ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అనారోగ్యంతో ఉన్న మాజీ మంత్రిని స్వయంగా కలిసి పరామర్శించడం ద్వారా ఎర్రబెల్లి తన ఆత్మీయతను చాటుకున్నారు. ఈ భేటీ సందర్భంగా ఇరువురు కొద్దిసేపు మాట్లాడుకున్నారు.

## 2027--28 విద్యా సంవత్సరం నుంచే చిలుకూరు యంగ్ ఇండియా పాఠశాలలో తరగతులు ప్రారంభించాలి



**సూర్యాపేట, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

చిలుకూరులో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలో 2027--28 విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభించేలా నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు గుట్టల్లో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 22 ఎకరాల విస్తీర్ణంలో చేపడుతున్న ఈ నిర్మాణ పనుల్లో భాగంగా బేస్‌మెంట్, కాంక్రీట్, పిల్లర్ల పనుల పురోగతిని పరిశీలించారు. పనుల ప్రస్తుత స్థితిగతులను సంబంధిత గుత్తేదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా పాఠశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసి, 2027--28 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు తరగతులు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం కోదాడలో రూ.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నవోదయ పాఠశాల నిర్మాణ పనులను కూడా మంత్రి పరిశీలించారు. భవన నిర్మాణ పురోగతిపై గుత్తేదారులతో సమీక్ష నిర్వహించి, పనులను త్వరితగతిన పూర్తి చేసి పాఠశాలను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నండ్‌లాల్ పవార్, ఎస్పీ కే. నరసింహ, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో సదర్ ఉత్సవాన్ని విజయవంతం చేద్దాం: గంగుల అంజలి యాదవ్

**మిర్యాలగూడ, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**




మిర్యాలగూడ పట్టణంలో త్వరలో నిర్వహించనున్న సదర్ సమ్మేళనాన్ని యాదవ సోదరులందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని గంగుల అంజలి యాదవ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని యాదవ సంఘ భవనంలో సదర్ ఉత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగుల అంజలి యాదవ్ మాట్లాడుతూ.. యాదవుల ఐక్యత, సంప్రదాయాలు, సంస్కృతిని చాటిచెప్పే సదర్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. త్వరలో జరగనున్న సదర్ సమ్మేళనానికి యాదవ సోదరులు, సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ వెల్ఫేర్ సంఘం అధ్యక్షుడు చింతలచెరువు లింగయ్య యాదవ్, గౌరవ సలహాదారు గుండెబోయిన నాగేశ్వరరావు యాదవ్, చేగొండి మురళీ యాదవ్, సురేష్ యాదవ్, అంజి యాదవ్, బోర మారయ్య యాదవ్, మట్టపల్లి సైదులు యాదవ్, చిమట ఎరయ్య యాదవ్, జవ్వాజి సత్యనారాయణ యాదవ్, చిలకల మురళి, ఉగ్గిది జానయ్య యాదవ్, కేపీ రాజు, జంగిలి గోపాలకృష్ణ, పట్టెం రామచంద్రయ్య యాదవ్, దొండ సురేష్, రాజు, జడ మధు, కుర్ర సాయి, ఊరిబండి శ్రీనివాస్, మండల రామ్మూర్తి, జీడయ్య యాదవ్, కానసాని సోమయ్య, ముక్క వెంకన్న యాదవ్, పేర్ల లింగయ్య, శ్రీనివాస్, కుమార్ తదితర యాదవ సోదరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో టెట్ పరీక్ష వాయిదా.. నవంబర్ 22న నిర్వహణ

**హనుమకొండ, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

రాష్ట్రంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయుల కోసం నిర్వహించాల్సిన తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీటెట్) పరీక్ష వాయిదా పడింది. తొలుత ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం నవంబర్ 19న పరీక్ష నిర్వహించాల్సి ఉండగా, అదే రోజున టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో విద్యాశాఖ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు కూడా ఉండటంతో టెట్ పరీక్ష తేదీని మార్చారు. ఈ మేరకు టెట్ పరీక్షను నవంబర్ 22వ తేదీన నిర్వహించనున్నట్లు పరీక్ష కన్వీనర్ జి. రమేష్ అధికారికంగా ప్రకటించారు. పరీక్ష తేదీ మార్పును అభ్యర్థులు గమనించి, అందుకు అనుగుణంగా తమ సన్నద్ధతను కొనసాగించాలని సూచించారు. అభ్యర్థులు నవంబర్ 17వ తేదీ నుంచి అధికారిక వెబ్‌సైట్ schooledu.telangana.gov.in ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నిర్దేశిత సమయంలో హాల్‌టికెట్లు పొందాలని సూచించారు.




## రైతులకు ఎఫ్‌పీఓ, ఎఫ్‌పీసీలపై అవగాహన కార్యక్రమం

**కీతవారిగూడెం, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



రైతులు సంఘటితంగా ఏర్పడి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర పొందడంతో పాటు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలని వ్యవసాయ విద్యార్థులు సూచించారు. గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా కీతవారిగూడెం గ్రామంలో రైతులకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓ), రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు (ఎఫ్‌పీసీ) ఏర్పాటు, వాటి ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీఓ, ఎఫ్‌పీసీల ఏర్పాటు విధానం, వాటి ముఖ్య ఉద్దేశాలు, రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. రైతులందరూ ఒక సంఘంగా ఏర్పడి తమ వ్యవసాయ ఉత్పత్తులను సమిష్టిగా విక్రయించడం ద్వారా మార్కెట్‌లో మెరుగైన ధర పొందవచ్చని తెలిపారు. అదేవిధంగా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సమిష్టిగా తక్కువ ధరకు కొనుగోలు చేసుకోవచ్చని వివరించారు. సంఘటితంగా పనిచేయడం వల్ల మార్కెటింగ్ సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు మధ్యవర్తుల ప్రమేయం తగ్గుతుందని, తద్వారా పెట్టుబడి ఖర్చులను నియంత్రించుకొని అధిక లాభాలు పొందే అవకాశం ఉంటుందని అవగాహన కల్పించారు. వ్యవసాయ ఉత్పత్తులకు సరైన ధర లభించడంతో పాటు మార్కెట్ పరమైన నష్టాలను కూడా తగ్గించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు యల్లపుల పృథ్వీరాజ్, తుమ్మల నాగయ్య, బడేటి వినయ్, వెల్పుల రామలింగయ్య, వెంకటేశ్వర్లు, గుడేపు శ్రీనివాస్, పాలెల్లి నాగేంద్రబాబు, దాసరి సైదులు పాల్గొన్నారు. ఏలూరుకు చెందిన సీహెచ్ఎస్‌డీ సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు ఎం. నవ్యశ్రీ, ఆర్. మోనిక, పి. హేమలత, వై. సౌమ్య, ఐ. సత్యజ్యోతి, వై. మనీషా గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## అపజయాలే విజయానికి తొలి మెట్లు.. విద్యార్థులకు చారుగుండ్ల రాజశేఖర్ స్ఫూర్తిదాయక సందేశం

**నవంబర్11 (ప్రజానేస్తం జ్వాల):**



జీవితంలో గెలుపోటములు సహజమని, ఓటమిని పాఠంగా మలుచుకున్నప్పుడే విజయ శిఖరాలను చేరుకోగలమని మోటివేషనల్ స్పీకర్, విద్యా మార్గదర్శకులు చారుగుండ్ల రాజశేఖర్ అన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, భవిష్యత్తు జీవితానికి అవసరమైన నైపుణ్యాలను అలవర్చే లక్ష్యంతో పీఎం శ్రీ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రత్యేక ప్రేరణాత్మక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు విలువైన సూచనలు, స్ఫూర్తిదాయక సందేశాలు అందించారు. ఈ సందర్భంగా చారుగుండ్ల రాజశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాల కే పరిమితం కాకుండా ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఏకాగ్రత, సమయపాలన, సమస్యలను పరిష్కరించుకునే సామర్థ్యం వంటి జీవన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే అపజయాలకు భయపడకుండా, వాటిని విజయానికి సోపానాలుగా మలుచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఉన్నత స్థాయికి ఎదిగిన అనేక మంది ప్రముఖుల జీవితాలను పరిశీలిస్తే వారి విజయాల వెనుక ఎన్నో వైఫల్యాలు, కష్టాలు, అవరోధాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఓటమి ఎదురైన ప్పుడు నిరాశ చెందకుండా, ప్రతి అనుభవం నుంచి పాఠం నేర్చుకోవాలని అన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం పట్ల స్పష్టత తో, నిరంతర కృషి మరియు పట్టుదలతో ముందుకు సాగితే విజయం సాధించడం సాధ్యమవుతుందని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. ఈ కార్యక్రమంలో పీఎం శ్రీ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. రాజశేఖర్, ఉపాధ్యాయులు కృష్ణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశంను మర్యాదపూర్వకంగా కలిసిన హనుమకొండ కలెక్టర్

**హనుమకొండ, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) చైర్మన్ బుర్రా వెంకటేశంను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయనను కలిసి మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం పరస్పరం మర్యాదపూర్వకంగా మాట్లాడుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ తహసీల్దార్ గుజ్జుల రవీందర్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

## కాజీపేట తెలంగాణ పబ్లిక్ స్కూల్‌కు శంకుస్థాపన

**కాజీపేట, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని కాజీపేటలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి బుధవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జీడబ్ల్యూఎంసీ మాజీ మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్యలతో కలిసి గుండు సుధారాణి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ద్వారా స్థానిక ప్రజలకు, విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. పాఠశాల నిర్మాణం పూర్తయితే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి, ప్రియాంక గాంధీ ఆల్ ఇండియా సంఘటన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బిల్లా శ్రీకాంత్, కాంగ్రెస్ నాయకులు గుండు పూర్ణచందర్, ఆకుతోట శిరీష్, పాలకుర్తి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో 10+2 విద్యా విధానం.. సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

**హనుమకొండ, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



తెలంగాణలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి నూతన 10ం2 విద్యా విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ తరహాలో రాష్ట్ర విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. స్కూల్ ఎడ్యుకేషన్‌లోనే ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేస్తూ విద్యా విధానాన్ని పునర్వ్యవస్థీకరించనున్నట్లు ఉన్నతస్థాయి సమీక్షలో వెల్లడించారు.ప్రతిపాదిత విధానం ప్రకారం నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక విద్య, 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు సెకండరీ విద్య, 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సీనియర్ సెకండరీ విద్య కొనసాగనుంది. ఈ మార్పుల ద్వారా పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సమగ్ర విద్యను అందించడంతో పాటు ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో భాగంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు భాషా పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై పూర్తి పట్టు సాధించేలా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించే విధంగా విద్యా విధానాన్ని రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## 16 మంది లబ్ధిదారులకు రూ.7.53 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**హనుమకొండ, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



హనుమకొండలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య 16 మంది లబ్ధిదారులకు సుమారు రూ.7.53 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులకు ఆమె స్వయంగా చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, పేద కుటుంబాలు అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు అత్యవసర వైద్య ఖర్చుల భారం తగ్గించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా పేదలు వైద్య చికిత్సకు దూరం కాకుండా ఈ పథకం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు.అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని ఆమె వెల్లడించారు. అవసరమైన వారికి ప్రభుత్వ సహాయం అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

## హనుమకొండ కలెక్టరేట్‌లో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు.. మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళులు




**హనుమకొండ, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

జాతీయ విద్యా దినోత్సవం, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా హనుమకొండ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన ఆజాద్ సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యా వ్యవస్థ ఆధునీకరణకు, విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి కొనియాడారు. విద్య అందరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా విద్యారంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# బస్సు ప్రయాణికులకు ఆర్టీసీ గుడ్‌న్యూస్.. 86 ప్రధాన బస్టాండ్లలో ఉచిత వైఫై సదుపాయం

**హనుమకొండ, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



బస్సు ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండే 86 ప్రధాన బస్‌స్టేషన్లలో ఉచిత ఇంటర్నెట్ (ఫ్రీ వైఫై) సదుపాయాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది.ప్రతిరోజూ 5 వేల మందికి పైగా ప్రయాణికులు రాకపోకలు సాగించే బస్టాండ్లను ఈ సదుపాయం కోసం ఎంపిక చేసినట్లు సమాచారం. ఈ వైఫై సేవలు అందుబాటులోకి వస్తే ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉండే సమయంలో ఇంటర్నెట్‌ను ఉచితంగా వినియోగించుకునే అవకాశం కలగనుంది. తద్వారా డిజిటల్ సేవలు, సమాచారాన్ని సులభంగా పొందేందుకు వీలవుతుంది.మరోవైపు ప్రయాణికులకు బస్సు సర్వీసులు, రాకపోకల సమయాలపై స్పష్టమైన సమాచారం అందించేందుకు కూడా ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ఎంపిక చేసిన బస్టాండ్లలో కంట్రోలర్లను నియమించడంతో పాటు, ప్రయాణికులు అవసరమైన వివరాలు తెలుసుకునేందుకు ప్రత్యేక ఫోన్ నంబర్లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది.ఈ సదుపాయాల ద్వారా ప్రయాణికులకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గడంతో పాటు, బస్టాండ్లలో సేవల నాణ్యత మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

# వడ్డేపల్లి బండ్‌పై ఫుడ్ స్ట్రీట్ పనులను వేగవంతం చేయాలి: జీడబ్ల్యూఎంసీ కమిషనర్ ఆదేశం

**హనుమకొండ, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



వడ్డేపల్లి బండ్‌పై ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సుందరీకరణ పనులతో పాటు ఫుడ్ స్ట్రీట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు.బుధవారం ఆయన నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం హనుమకొండ బస్టాండ్ పరిసరాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను తనిఖీ చేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.తదుపరి గోవిందరాజులగుట్ట ప్రాంతంలో స్వచ్ఛ ఆటో పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, చెత్త వర్గీకరణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేలా అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని కమిషనర్ అధికారులకు సూచించారు.

# త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**హైదరబాద్, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**



హైదరాబాద్‌లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే జిల్లాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.బుధవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు కె. విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రిని కలిసింది. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమోదించిన పలు తీర్మానాలతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పించే విషయంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల చేసిన సానుకూల ప్రకటనలపై సంఘ కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపినట్లు నాయకులు వివరించారు. ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేసి జర్నలిస్టుల్లో నెలకొన్న ఆందోళనకు తెరదించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేసినట్లు మంత్రికి తెలిపారు.అదేవిధంగా జర్నలిస్టుల మరో ప్రధాన సమస్య అయిన ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని, జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ అంశంపై కూడా సంఘం చేసిన తీర్మానాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.వినతిపై స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముందుగా హైదరాబాద్‌లో పనిచేస్తున్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. త్వరలోనే వారికి ఇళ్ల స్థలాలు అందిస్తామని, ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే జిల్లాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా స్థలాలు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రాజేష్ పాల్గొన్నారు.

## ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలి

**ఆత్మకూరు, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశించారు. ప్రతి గ్రామంలో నీటి వనరులను సంరక్షిస్తూ, ప్రతి ఇంటికి నల్లా ద్వారా సురక్షిత మంచినీరు అందేలా చూడాలని సూచించారు.ఆత్మకూరు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరా, వీబీ–జీ రామ్ జీ పథకం అమలు, గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగునీటి వనరులను పరిరక్షించాలని, బావుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి గ్రామాల్లో భూగర్భ జలమట్టాన్ని తప్పనిసరిగా పరిశీలించి సంబంధిత నివేదికలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

### ప్రతి జాబ్ కార్డు కలిగిన కూలీకి ఉపాధి కల్పించాలి

వీబీ–జీ రామ్ జీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి జాబ్ కార్డు కలిగిన కూలీకి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా అవగాహన కల్పించి, పనుల్లో భాగస్వాములను చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. గ్రామాల్లో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ఉపాధి హామీ పథకం ద్వారా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

### విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే సస్పెన్షన్‌కు కూడా వెనుకాడబోనని స్పష్టం చేశారు. నీటిని వృథా చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే విచారణ జరిపి నిబంధనల మేరకు రూ.500 వరకు జరిమానా విధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మంచినీటితో పాటు విద్యుత్‌ను కూడా పొదుపుగా వినియోగించుకోవాలని, నీటి సంరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ప్రజల తాగునీటి అవసరాలు, రైతుల జీవనాధారం వంటి కీలక అంశాలపై ప్రతిపక్షాలు రాజకీయ లబ్ధి కోసం ప్రజల సెంటిమెంట్‌తో ఆడుకోవడం సరికాదని అన్నారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించి సమస్యల పరిష్కారానికి అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.భూగర్భ జలాల సంరక్షణ, నీటి పొదుపు, ప్రతి ఇంటికి సురక్షిత మంచినీటి సరఫరా లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com



# ప్రభుత్వ భూముల అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో ఆరుగురి అరెస్ట్

- **తప్పుడు అండర్‌టేకింగ్‌తో రూ.కోట్ల విలువైన భూమి రిజిస్ట్రేషన్**
- **రూ.1.30 కోట్ల ఫైనాన్స్ కోసం పక్కా పథకం.. సీఐ వెల్లడి**

**హుజూర్‌నగర్, నవంబర్ 11 (ప్రజానేస్తం జ్వాల):**

ప్రభుత్వం దశాబ్దాల క్రితమే భూసేకరణ చేసి పరిహారం చెల్లించిన భూములను తిరిగి ప్రైవేటు వ్యక్తుల పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించిన కేసులో హుజూర్‌నగర్ పోలీసులు ఆరుగురిపై చర్యలు చేపట్టారు. రెవెన్యూ అధికారులకు తప్పుడు సమాచారం అందించి, తప్పుడు అండర్‌టేకింగ్ సమర్పించి ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఆరుగురి అరెస్టు వివరాలను సీఐ వెల్లడించినట్లు సమాచారం.

### 1971లోనే భూసేకరణ.. రికార్డుల్లో మాత్రం పట్టా

పోలీసుల వివరాల ప్రకారం.. మేళ్లచెర్వు గ్రామానికి చెందిన బోనగిరి సామ్రాజమ్మ తండ్రి భువనగిరి వెంకటనర్సయ్యకు గతంలో హుజూర్‌నగర్, మేళ్లచెర్వు ప్రాంతాల్లో వ్యవసాయ భూములు ఉండేవి. 1971లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పీ) కాలువల నిర్మాణం కోసం హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 458లో ఉన్న భూమిని ప్రభుత్వం భూసేకరణ చట్టం ప్రకారం సేకరించి పరిహారం చెల్లించింది.అయితే భూసేకరణ జరిగినప్పటికీ సదరు భూమి రెవెన్యూ రికార్డుల్లో ఎన్ఎస్పీ కాలువ భూమిగా నమోదు కాకపోవడం, పాత పట్టా వివరాలు కొనసాగడం ఈ అక్రమ వ్యవహారానికి అవకాశంగా మారినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

### 9 ఎకరాల 16 గుంటల భూమిపై కన్ను

హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 458/A3/3లో 9 ఎకరాల 16 గుంటల భూమి సామ్రాజమ్మ పేరున పట్టా ఉన్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంలో పసుపులేటి రామారావు కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు పేర్కొన్నారు.ప్రభుత్వం గతంలోనే సేకరించిన భూమి అయినప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో పట్టా కొనసాగుతుండటాన్ని ఆసరాగా చేసుకుని విక్రయానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో జొన్నలగడ్డ శ్రీనివాసరావు, కన్నె కొండల్‌రావు, బేత వెంకట్‌రెడ్డి, శేషం రవి తదితరులు కొనుగోలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

### రూ.1.30 కోట్ల ఫైనాన్స్ కోసం పథకం

భూమి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అగ్రిమెంట్‌ను చూపించి హైదరాబాద్‌కు చెందిన కనుమూరి కళ్యాణ్ కుమార్ వద్ద ఫైనాన్స్ పొందేందుకు నిందితులు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. తొలుత రూ.1.50 కోట్లు కోరగా, రూ.1.30 కోట్లు ఇచ్చేందుకు ఆయన అంగీకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

### తప్పుడు అండర్‌టేకింగ్‌తో రిజిస్ట్రేషన్

2026 ఆగస్టు 6న సంబంధిత వ్యక్తులు హుజూర్‌నగర్ తహశీల్దార్ కార్యాలయానికి




హాజరై రెవెన్యూ అధికారులకు తప్పుడు అండర్‌టేకింగ్ సమర్పించినట్లు పోలీసులు ఆరోపించారు. ఈ పత్రాల ఆధారంగా కనుమూరి కళ్యాణ్ కుమార్ పేరున భూమిని రిజిస్ట్రేషన్ చేయించినట్లు కేసు వివరాల్లో పేర్కొన్నారు.ఈ లావాదేవీలో రూ.1,07,95,089 విలువైన చెక్కును సామ్రాజమ్మ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం అందులో నుంచి రామారావు కుమార్తె లావణ్య ఖాతాకు రూ.5 లక్షలు, మరో వ్యక్తికి సంబంధించిన ఖాతాకు రూ.6 లక్షలు బదిలీ చేసినట్లు గుర్తించారు. సామ్రాజమ్మకు రూ.లక్ష నగదు ఇచ్చినట్లు పోలీసుల వివరాలు వెల్లడిస్తున్నాయి.


### ఆరుగురిపై కేసు.. పోలీసుల తదుపరి చర్యలు

ఈ వ్యవహారంపై హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 255/2026 కింద దీఓ సెక్షన్లు 61(2), 318(4), 338, 336(3), 217 రెడ్‌విత్ 3(5) ప్రకారం కేసు నమోదు చేశారు.ఈ కేసులో బోనగిరి సామ్రాజమ్మ, పసుపులేటి రామారావు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, కన్నె కొండల్‌రావు, బేత వెంకట్‌రెడ్డి, శేషం రవిలను నిందితులుగా పేర్కొన్నారు. సామ్రాజమ్మకు నోటీసులు జారీ చేసినట్లు పోలీసులు తెలిపారు. కేసులో మిగిలిన నిందితులపై తదుపరి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

### ప్రభుత్వ భూముల రక్షణపై ప్రశ్నలు

ఎన్ఎస్పీ కాలువ నిర్మాణం కోసం దశాబ్దాల క్రితమే ప్రభుత్వం సేకరించిన భూములు తిరిగి ప్రైవేటు వ్యక్తుల పేర్లపై రిజిస్ట్రేషన్ కావడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. భూసేకరణ రికార్డులు, రెవెన్యూ రికార్డుల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ఇలాంటి వ్యవహారాలకు అవకాశం ఏర్పడుతోందా? రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భూమి పూర్వాపరాలను అధికారులు పరిశీలించారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంబంధిత శాఖలు సమగ్రంగా రికార్డులను పరిశీలించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# భూముల రీసర్వే పారదర్శకంగా చేపట్టాలి







- **నవంబర్ నెలాఖరులోగా తొలి విడత సర్వే పూర్తి చేయాలి**
- **అవకతవకలకు పాల్పడితే సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు: మంత్రి పొంగులేటి**

**సూర్యాపేట, నవంబర్ 11(ప్రజానేస్తం జ్వాల):**

రాష్ట్రంలో భూముల రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించి రైతులకు ప్రయోజనం చేకూర్చాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నవంబర్ నెలాఖరులోగా తొలి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాలతో పాటు నక్షా లేని గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి మాట్లాడుతూ రీసర్వేలో వేగం కంటే నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, రైతులకు ముందస్తు సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రతి మండలంలో ప్రత్యేక సర్వే బృందాలను ఏర్పాటు చేసి, లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని ఆదేశించారు.రీసర్వే వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించి, వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. సర్వే పూర్తయిన ప్రాంతాల్లో క్యూఆర్ కోడ్‌తో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందించనున్నట్లు వెల్లడించారు.అసైన్డ్ భూముల పట్టాల అసలుదనం, భూముల విస్తీర్ణం, ప్రస్తుత అనుభవదారుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రీసర్వేలో అక్రమాలు, అవకతవకలకు పాల్పడే అధికారులపై సస్పెన్షన్‌తో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా ఏడాదిన్నరలో మూడు విడతల్లో రీసర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, అర్హులైన లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, ఆర్డీఓలు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం

**విద్యాభివృద్ధి, జాతీయ సమైక్యతకు ఆయన చేసిన కృషి ఆదర్శనీయం: అడిషనల్ కలెక్టర్ హరి సింగ్ నాయక్**

**సూర్యాపేట, నవంబర్11,(ప్రజానేస్తం జ్వాల):**

భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని సూర్యాపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ హరి సింగ్ నాయక్ అన్నారు. మైనార్టీ వెల్ఫేర్ డే, మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హరి సింగ్ నాయక్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా ఆజాద్ విద్యారంగ అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. జాతీయ సమైక్యత, మైనార్టీల సంక్షేమం, విద్యా వికాసానికి ఆయన చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆజాద్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని విద్యాభివృద్ధికి, సమాజ పురోగతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీబీసీడబ్ల్యూఓ విశాల్ ధార, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్లు తాహిర్, జహీర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణు, మాజీ కౌన్సిలర్ అంజద్ అలీ, ఖలీల్ అహ్మద్, షేక్ తాహీర్, ఎస్.కె. జహంగీర్, ఖలీద్ అహ్మద్, అస్రార్, కరాటే సయ్యద్, సిద్ధిక్, అస్రార్ నోమాని, డాక్టర్ కృష్ణ బంటు, జిల్లా మైనార్టీ నాయకులు, కలెక్టరేట్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.




## నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం కేసు.. మీ-సేవ, ఆధార్ కేంద్రాలు శాశ్వత రద్దు

- **చందు మీ-సేవ కేంద్రం నిర్వాహకుడిపై ఎఫ్ఐఆర్.. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ**

**నల్గొండ, నవంబర్11,(ప్రజానేస్తం జ్వాల):**



నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం వ్యవహారంలో సహకరించినందుకు నల్గొండ జిల్లా కేంద్రంలోని చందు మీ-సేవ కేంద్రంతో పాటు ఆధార్ కేంద్రాన్ని శాశ్వతంగా రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.డీఈఓ కార్యాలయం సమీపంలో పనస చంద్రశేఖర్ నిర్వహిస్తున్న చందు మీ-సేవ, ఆధార్ కేంద్రాలు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం జారీ వ్యవహారంలో సహకరించినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెండు కేంద్రాల అనుమతులను శాశ్వతంగా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## ఈ సమస్య ఉన్నా సరైన తిండి తింటే బరువు తగ్గడం పెద్ద కష్టమేం కాదట

పీసీఓఎస్ ఒకసారి వచ్చిన తర్వాత చాలా కాలం పాటు సమస్యలు కలిగిస్తుంది. ఇది మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా బరువు పెరగడం చాలా సాధారణం. కొంతమంది మాత్రం బరువు తగ్గలేమనుకుంటారు. కానీ ఇది కరెక్ట్ కాదు. సరైన ఆహారపు అలవాట్లు, జీవనశైలి మార్పులతో బరువును తగ్గించవచ్చు.పీసీఓఎస్ ఉన్న వారిలో ఇన్సులిన్ హార్మోన్ సరిగా పని చేయదు. దీని వలన గ్లూకోజ్ స్థాయిలు పెరిగి శరీరానికి ఇన్సులిన్ తగిన విధంగా స్పందించదు. దీని ఫలితంగా శరీరం కొవ్వును నిల్వ చేసుకుంటుంది. ఇలా శరీర బరువు పెరుగుతుంది. అయితే ప్రతిరోజూ తినే ఆహారంలో చిన్న చిన్న మార్పులు చేయడం వల్ల బరువును తగ్గించవచ్చు.పొట్టలో ఉండే మంచి బ్యాక్టీరియా జీర్ణక్రియను మెరుగుపరచి బరువును నియంత్రించేందుకు సహాయం చేస్తుంది. కానీ పీసీఓఎస్ ఉన్నవారిలో ఈ మంచి బ్యాక్టీరియా తక్కువగా ఉంటుంది. అందుకే పెరుగు, చద్దన్నం, పచ్చళ్ళు, ఇడ్లీ, దోసె లాంటి పులియబెట్టిన పదార్థాలు తీసుకోవడం మంచిది.ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారాన్ని తినడం వల్ల ఎక్కువసేపు ఆకలేయదు. ఇది ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుంది. హార్మోన్ల సమతుల్యత కూడా చక్కబడుతుంది. ఫలితంగా బరువు తగ్గే అవకాశాలు పెరుగుతాయి. ఓట్స్, బ్రోకోలి, అవకాడో, బెర్రీస్, తృణధాన్యాలు, యాపిల్స్ వంటి ఫలాలు తినడం మంచిది.పీసీఓఎస్ ఉన్నవారిలో శరీర వాపు ఎక్కువగా కనిపిస్తుంది. దీర్ఘకాలంగా వాపు ఉండడం వల్ల బరువు పెరగడం జరుగుతుంది. దీన్ని తగ్గించేందుకు మెడిటెరేనియన్ డైట్ ఉపయోగపడుతుంది. ఇందులో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, ఆలివ్ నూనె వంటివి ఉండాలి. అలాగే ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు పుష్కలంగా ఉండే చేపలను ఆహారంలో చేర్చటం శరీరానికి మేలు చేస్తుంది. కొవ్వులంటే బరువు పెరుగుతుందనే భయం చాలా మందిలో ఉంటుంది. కానీ మంచి కొవ్వులు శరీరానికి మేలు చేస్తాయి. అవకాడో, ఆలివ్ నూనె, నట్స్, కొబ్బరి నూనె వంటివి తినడం వల్ల ఆకలిని తగ్గించవచ్చు. దీని వలన బరువు తగ్గడం సులభమవుతుంది. కేవలం క్యాలరీలు తగ్గిస్తే సరిపోదు. ప్రాసెస్ చేసిన ఆహారాలు, జంక్ ఫుడ్ నుంచి దూరంగా ఉండాలి. గుడ్లు, పాలు, మాంసం, చేపలు లాంటి ప్రోటీన్ ఉన్న ఆహారం తినడం వల్ల ఎక్కువ సేపు ఆకలేయదు. ప్రతివారం కనీసం మూడు రోజులు బరువులెత్తే వ్యాయామాలు చేయడం వల్ల నడుము చుట్టూ ఉన్న కొవ్వు కరిగిపోతుంది. పూర్తి నిద్ర, ఒత్తిడి తగ్గించే యోగా, ధ్యానం చేయడం వల్ల కూడా బరువు తగ్గడంలో సహాయం చేస్తాయి.

## ఈ పండ్లను పొరపాటున కూడా ఫ్రిడ్జ్‌లో పెట్టకండి..

రోజువారీ ఆహారంలో పండ్లకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఇవి శరీరానికి శక్తిని అందించడమే కాక.. ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే రోజూ తీసుకోవాల్సినవే. అయితే కొందరు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు ఫ్రిడ్జ్ సహాయాన్ని తీసుకుంటారు. కానీ కొన్ని రకాల పండ్లను ఫ్రిడ్జ్ లో నిల్వ ఉంచడం వల్ల పోషకాలు తగ్గిపోతాయి. అంతేకాదు వాటి సహజమైన రుచి, నాణ్యత కూడా తగ్గిపోతుంది. వేసవిలో ఎక్కువగా కనిపించే పుచ్చకాయను చాలా మంది ఫ్రిడ్జ్ లో నిల్వ చేస్తారు. కానీ దీని తేమ, పోషక విలువలు గది ఉష్ణోగ్రతలోనే బాగుంటాయి. ఫ్రిడ్జ్ లో ఉంచినప్పుడు ఇందులో ఉండే లైకోపిన్, బీటా కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పని చేయలేకపోతాయి. అందువల్ల పుచ్చకాయను ఫ్రిడ్జ్ లో కాకుండా గది ఉష్ణోగ్రతలో నిల్వ చేయాలి.మార్కెట్‌లో లభించే మామిడిపండ్లలో చాలా భాగం ఇథలీన్ వాయువుతో మగ్గించబడుతుంటాయి. అలాంటి పండ్లు ఫ్రిడ్జ్ లో ఉంచితే అవి త్వరగా నల్లబడిపోతాయి. మామిడి ఇంకా మగ్గని దశలో ఉంటే గది ఉష్ణోగ్రతే మంచి పరిష్కారం. పండిన తరువాత కొంతసేపు నిల్వ ఉంచాలంటే ఫ్రిడ్జ్ లో పెట్టవచ్చు కానీ ఎక్కువసేపు ఉంచకపోవడం ఉత్తమం.అరటిపండ్లను చల్ల ప్రదేశాల్లో ఉంచినప్పుడు అవి త్వరగా రంగు మారి నలుపు అవుతాయి. ఫలితంగా అందవిహీనంగా మారిపోతాయి. పైగా రుచి కూడా తగ్గిపోతుంది. కనుక అరటిపండ్లను గదిలో ఉంచితేనే అవి సన్నగా ఉండి రుచికరంగా ఉంటాయి. పండని అవకాడోను ఫ్రిడ్జ్‌లో పెట్టినప్పుడు అది సమయానికి మగ్గకపోవచ్చు. కాస్త మగ్గిన తర్వాత ఫ్రిడ్జ్‌లో ఉంచితే కొంతకాలం నిల్వ ఉంటుంది. కానీ రుచి మెత్తబడకుండా ఉండాలంటే గది ఉష్ణోగ్రతే మేలు చేస్తుంది.చల్లదనంలో ఉంచిన ద్రాక్ష పండ్లు తేమ కోల్పోయి త్వరగా వాడిపోతాయి. ఫలితంగా రుచి తగ్గిపోతుంది. గది ఉష్ణోగ్రతలో ఉంచితే ఇవి తాజాగా ఉంటాయి. అయితే ఎక్కువ రోజులు నిల్వ ఉంచే అవసరం ఉంటే ఎయిర్‌టైట్ డబ్బాలో వేసి ఫ్రిడ్జ్ లో పెట్టడం మంచిది. పీచ్ పండ్లు సున్నితంగా ఉండే తేమతో నిండినవి. ఫ్రిడ్జ్ లో ఉంచినప్పుడు వాటి తేమ తగ్గిపోతుంది. దీని వల్ల చర్మం కఠినంగా మారి రుచి బాగా తగ్గిపోతుంది. సహజంగా మగ్గే అవకాశం ఉండే స్థలంలో ఉంచడం ఉత్తమం. పైనాపిల్ పండిన తర్వాత గది ఉష్ణోగ్రతలోనే ఉంచడం మంచిది. చల్లదనంలో ఉంచినప్పుడు దీనిలోని తేమ పోయి రుచి తగ్గిపోతుంది. అయితే పూర్తిగా మగ్గిన పైనాపిల్ ముక్కలను ఫ్రిడ్జ్‌లో తక్కువ సమయం ఉంచితే హానికరం కాదు. బాదం, జీడిపప్పు, కిస్మిస్ లాంటి డ్రైఫ్రూట్స్‌ను ఫ్రిడ్జ్‌లో ఉంచినప్పుడు అవి తేమతో తడిసిపోతాయి. ఫలితంగా ఫంగస్ ఏర్పడి రుచి మారుతుంది. ఇవి పొడి ప్రదేశంలో గాలి చొరబడకుండా ఉండే డబ్బాలో ఉంచడం ఉత్తమం. పండ్లు తినడం ఆరోగ్యానికి మంచిదే. . ప్రతి పండుకు తగిన ఉష్ణోగ్రత అవసరం ఉంటుంది. కొన్ని రకాల పండ్లను ఫ్రిడ్జ్ లో పెట్టడం వల్ల వాటి పోషకాలు తగ్గిపోతాయి. కాబట్టి పండ్లు ఫ్రెష్‌గా, ఆరోగ్యకరంగా ఉండాలంటే వాటి లక్షణాలను బట్టి నిల్వ చేసే తీరు మార్చుకోవాలి.